క్లుప్తంగా

లోకోస్ యాప్‌పై శిక్షణ



శిక్షణ ఇస్తున్న టీఓటీ గురుమూర్తి

బలిజిపేట: సంఘ సభ్యుల ఆధునీకరణపై మహిళాసంఘాలకు లోకోస్ యాప్‌పై శిక్షణ కార్యక్రమం బలిజిపేటలోని వైఎస్సార్ క్రాంతి పథం మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే శిక్షణలో రెండు రోజులు గ్రామ మహిళా సంఘాలకు శిక్షణ, ఒకరోజు ఫీల్డ్ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన టీఓటీ గురుమూర్తి వారికి సూచనలు అందించారు. సంఘాల ఆధునీకరణ, కొత్త సంఘాల చేర్పులు, సంఘ సభ్యులు ఎవరైనా మృతి చెందితే వారి తొలగింపు తదితర అంశాలను ఏవిధంగా యాప్‌లో అప్‌లోడ్ చేయాలో వివరించారు. ఎటువంటి పొరపాట్లు లేకుండా సంఘాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. రెండు రోజుల శిక్షణ అనంతరం గ్రామాల్లో ఫీల్డ్ వర్క్ నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం ఉమామహేశ్వరరావు, సీసీలు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నదీ తీరాన వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామి గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు స్వామికి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడి స్వామి వారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని, అలాగే సంతానం లేనివారు స్వామివారికి ముడుపులు చెల్లిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందన్న నమ్మకం భక్తులకు ఉందని అర్చకులు తెలిపారు. దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులందరికీ ఆలయ అర్చకుడు శ్రీనివాసరావు పర్యవేక్షణలో తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

కలెక్షన్ సెంటర్లతో గిరిజనోత్పత్తులకు గిట్టుబాటు

సీతంపేట: నాబార్డు ఆర్థిక సాయంతో ఆర్ట్స్ సంస్థ ఏర్పాటు చేసిన కలెక్షన్ సెంటర్‌లతో గిరిజనోత్పత్తులకు గిట్టుబాటు ధరలు వస్తాయని హార్టీకల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ రత్నాచార్యులు అన్నారు. మండలంలోని గజిలి, పాతరేగుల గూడ, సీతంపేట గ్రామాల్లో నిర్మిస్తున్న కలెక్షన్ సెంటర్‌లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు పండించిన ఉత్పత్తులను ఇక్కడ నిల్వ చేసుకుని మంచి ధరలు వచ్చిన తర్వాత విక్రయించుకోవడానికి వీలవుతుందన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వ్యాపార కార్యక్రమాలు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా హార్టీకల్చర్ ఆఫీసర్ కెఎస్ఎన్.రెడ్డి, హెచ్‌వో అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ వారి డ్రైవర్ ట్రైనింగ్ స్కూల్ నుంచి శిక్షణ పొంది హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీవో కల్పనాకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థి విధిగా లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ ఒక సంవత్సరం అనుభవం కలిగి ఉండాలన్నారు. ఎంపిక కమిటీ ద్వారా దరఖాస్తులు పరిశీలన అనంతరం అన్ని రకాల అర్హులైన 16 మందిని హెవీ డ్రైవింగ్ శిక్షణకు పంపించనున్నామన్నారు. శిక్షణ కాలం పూర్తయ్యేంత వరకు అభ్యర్థులకు భోజన, వసతి సౌకర్యాలు, శిక్షణ ఫీజు, లైసెన్సు ఫీజు చెల్లించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 18న ఉదయం 10.30 గంటలకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో సీతంపేట ఐటీడీఏలో హాజరు కావాలని కోరారు.

రామాలయానికి భూమి పూజ



రామాలయానికి భూమి పూజ చేస్తున్న గ్రామస్తులు

రేగిడి: మండల పరిధిలోని చిన్నకోడిశ గ్రామంలో గురువారం రామాలయ నిర్మాణానికి గ్రామస్తులు భూమిపూజ చేశారు. ఉదయం నుంచి గ్రామస్తులంతా భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. అందరి సహకారంతో రామాలయాన్ని నిర్మించుకునేందుకు ముందుకు రావడం గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో సువర్ణ పాలన

- ఎమ్మెల్యే జోగారావు



శ్రీరంగరాజపురంలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రంలో సువర్ణపాలన సాగుతోందని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. బలిజిపేట మండలంలోని శ్రీరంగరాజపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాన్ని సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్నారని ఎమ్మెల్యే జోగారావు ఈ సందర్భంగా గ్రామస్తులకు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకం అందిందా? లేదో తెలుసుకునేందుకు, అర్హులై ఉండి పథకానికి దూరమైతే ఎందుకు దూరమయ్యారో గుర్తించి వారికి పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు గడపగడపకూ తిరిగి తెలుసుకోవాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తమకు దిశానిర్దేశం చేసి పంపించారన్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలే కాకుండా గ్రామాలలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో ఎటువంటి లోపాలు ఉన్నా వాటిని తక్షణమే సరిచేసేందుకు గడపగడపకు తిరుగుతున్నామని తెలిపారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించి ఆయనకు మద్దతు పలికి రానున్న రోజులలో సీఎంగా మరోసారి చేసుకుందామని ప్రజలను కోరారు. ప్రజలకు సేవచేసేందుకే వలంటీర్ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటుచేసిందని తెలిపారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తోందని చెప్పారు. వేరే ప్రభుత్వాలు ఏవి వచ్చినా ఇన్నిసంక్షేమ పథకాలు అందించబోరని, ఉన్నవాటిని తొలగించే అవకాశాలున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుమూర్తి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రత్నకుమారి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, సర్పంచ్ సుందరరావు, మోహన్, సూర్యనారాయణ, కె.వెంకటరమణ, అప్పలనాయుడు, శ్రీనివాసరావు, మహందాతనాయుడు, టి.ప్రసాదరావు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గిరిజనులకు అండగా నిలిచిన ఎమ్మెల్యే



ఆస్పత్రి వద్ద మృతుల బంధువులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: బందలుప్పి పంచాయతీ, నిమ్మవానివలస గ్రామంలో వివాహ శుభ కార్యక్రమానికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి ఇద్దరు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం జిల్లా ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు. కుటుంసభ్యులు మృతదేహాల కోసం నిరీక్షిస్తున్న విషయం తెలుసుకుని ఆస్పత్రి వైద్యాధికారులు, పోలీస్ అధికారులతో మాట్లాడి పోస్టుమార్టం త్వరగా చేయించి వారికి వాహనాల సౌకర్యం కల్పించి, అవసరమైన సహాయ సహకారాలు అందజేశారు.

సంతలో పశు వైద్య శిబిరం



సంతలో వైద్యశిబిరం నిర్వహించిన పశువైద్య సిబ్బంది

పార్వతీపురంటౌన్: వేసవి కాలంలో పశువులు వ్యాధుల బారిన పడకుండా చర్యలు చేపట్టాలని పశువైద్యాధికారి డాక్టర్ భోగి చక్రధర్ అన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని సంత ప్రాంతంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పశువులకు తెగులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అంటు వ్యాధులు సంక్రమించకుండా రైతులకు మందులు అందజేశారు. సంతల్లో పశువులు రవాణా చేసేటప్పుడు వాటికి రక్షణ కల్పిస్తూ వైద్యులు, అందించిన ధ్రువీకరణ పత్రాలు ఉంటేనే రవాణా చేయాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల లక్ష్యాలను పూర్తి చేయాలి

- ఎంపీపీ ఉరిటి రామారావు



మాట్లాడుతున్న ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి:

పక్కా గృహాల నిర్మాణాల లక్ష్యాలను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. మండలానికి మంజూరైన 1400 గృహాల నిర్మాణాలను ప్రారంభించేలా లబ్ధిదారులకు అవగాహన కలిగించాలన్నారు. జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గృహ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేందుకు అవసరమైన ప్రణాళికలు చేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఇళ్ల నిర్మాణాలలో పురోగతి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ జి.పైడితల్లి, ఏఈ వి.అఖిల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నవరంలో 'విద్యా పంచాయతీ'



విద్యార్థులతో ముచ్చటిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్

పాలకొండ రూరల్: పిల్లల విద్యా ప్రమాణాల రోజువారీ మెరుగుదలపై తల్లితండ్రుల పర్యవేక్షణ కీలక భూమిక పోషిస్తుందని పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్ అన్నారు. మండంలోని అన్నవరం గ్రామంలో 'విద్యా పంచాయతీ' అనే సరికొత్త కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అక్కడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు, వారి తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక విద్యాధికులతో సమావేశమయ్యారు. పాఠశాల విద్యార్థుల నోట్, వర్కు బుక్స్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరుపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. నెలలో ఒకసారి ఇటువంటి పంచాయతీలు స్థానిక పెద్దలు, ప్రజాప్రతినిధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గవర రాజశేఖర్, వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్, ఎంఈవో ఎం.సూర్యనారాయణ, విద్యా కమిటీ చైర్మన్ కె.అమ్మాజి, జి.ప్రసాదరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కథల పోటీలు



విద్యార్థులు వేసిన చిత్రాలు

గరుగుబిల్లి:

మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు గురువారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ మేరకు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథల పోటీలు, డ్రాయింగ్ తదితర పోటీలను నిర్వహించారు. శిక్షణ శిబిరంలో భాగంగా ప్రతీరోజు విద్యార్థులకు పోటీలను నిర్వహించడంతో పాటు మహనీయుల జీవిత విశేషాలను వివరించడం జరుగుతుందని శాఖా గ్రంథాలయ నిర్వాహకులు మధుసూధనరావు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి ఆర్ఐటీఐలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెన్త్ క్లాస్‌లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు అర్హులన్నారు. తమ ఐటీఐ వద్ద ఎలక్ట్రీషియన్ 20 సీట్లు, వెల్డర్ 40 సీట్లు, ఫిట్టర్ 20 సీట్లు, ఎలక్ట్రానిక్స్ 24 సీట్లు, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ 24 సీట్లు, కోపా 48 సీట్లు, డ్రెస్ మేకింగ్ 48 సీట్లను ఈ విద్యా సంవత్సరంలో భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు జూన్ 6వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్) దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొదటి కౌన్సెలింగ్‌ను సాలూరు ప్రభుత్వ ఐటీఐ నందు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 79813 08986 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలన్నారు.

రోగులకు అందుబాటులో సేవలు



మరుపెంటలో రోగులతో మాట్లాడుతున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

గరుగుబిల్లి: రోగులకు అందుబాటులో సేవలను అందించేందుకు ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డా. టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని మరుపెంటలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో ఏర్పాటు చేసిన మందులు, వ్యాధి నిర్ధారణ పరికరాలను తనిఖీ చేశారు. రోగుల ఆరోగ్య తనిఖీల వివరాలు, ఓపీ రికార్డులను పరిశీలించి అనారోగ్య సమస్యలు, నిర్ధారణ పరీక్షల వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో వుంచి వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ రికార్డులను పరిశీలించి బరువు, శారీరక ఎత్తు వయస్సుకు తగ్గట్లుగా ఉన్నదీ లేనిదీ పరిశీలించి నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డా. ప్రియాంక, సూపర్‌వైజర్ ఉదయకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భామిని: మండలంలో శుక్రవారం విద్యుత్ కోత విధించనున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ బి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎంఐ పేరున విద్యుత్ లైన్ల జంగిల్ క్లియరెన్స్ చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

అంటువ్యాధులకు గురికాకుండా చూసుకోవాలి



చెల్లింపేటలో వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న హోలీస్పిరిట్ సిబ్బంది

బలిజిపేట: ప్రజలు అంటువ్యాధులకు గురికాకుండా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బలిజిపేట హోలీస్పిరిట్ కేర్ అండ్ సపోర్ట్ సెంటర్ సీహెచ్‌సీ సిస్టర్ జీవా హితవు పలికారు. మండలంలోని చిలకలపల్లి, చెల్లింపేట గ్రామాల్లో అంటువ్యాధులు, వడదెబ్బపై వేతనదారులకు గురువారం అవగాహన కల్పించారు. వేసవిలో పనులకు వెళ్లేవారు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు తప్పనిసరిగా మంచినీరు, మజ్జిగ వంటి ద్రవపదార్థాలను వినియోగించాలని, అంటువ్యాధులు సోకితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అంటువ్యాధులు పక్కనున్న వారికి త్వరగా వ్యాపించే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తలు తప్పనిసరి అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వేతనదారులకు ఓఆర్ఎస్ పంపిణీ చేశారు. దీంతో పాటు మరికొన్ని దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తవిటయ్య, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మస్తరులో లోపాలు సరిచేయాలి



బలిజిపేట: భైరిపురంలో మస్టరును పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు

సీతానగరం:

మండలంలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారుల మస్తరులో వస్తున్న లోపాలను సరిచేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన గెడ్డలుప్పి గ్రామం చెరువులో వేతనదారులు చేస్తున్న పనులు, మస్తరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనుల్లో పాల్గొన్న వేతనదారులకే మస్తరు వేయాలని, పనుల్లో పాల్గొనని వేతనదారులకు మస్తరు వేస్తున్నట్లు కొన్ని గ్రామాల్లో వదంతులు వస్తున్నాయని వాటిని నమ్మవద్దన్నారు. క్షేత్ర సహాయకులు పనుల్లో పాల్గొనే వారికి విధిగా మస్తరు వేసి ఆన్‌లైన్‌ద్వారా అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే పనులు చేపట్టడానికి వాతావరణం అనుకూలించడం వల్ల వేతనదారులు సమయ పాలన పాటించి టెక్నికల్ సహాయకులు ఇచ్చిన కొలతల ఆధారంగా పనులు చేసి ప్రభుత్వం ప్రకటించిన వేతనం అందిపుచ్చుకోవాలని కోరారు. ఎండలు తీవ్రంగా ఉన్న రోజుల్లో టెంట్‌లకింద, చెట్లకింద సేదదీరాలని సూచించారు. కార్యక్రమంలో క్షేత్రసహాయకులు, మేట్‌లు పాల్గొన్నారు.



సీతానగరం: క్షేత్ర సహాయకుడికి సూచనలిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

మస్టరులో తప్పిదాలు సహించం

బలిజిపేట: వేతనదారుల మస్టరులో తప్పిదాలను సహించమని డ్వామా పీడీ రామచంద్రరావు స్పష్టం చేశారు. మండలంలోని పెదపెంకి పంచాయతీ భైరిపురంలో ఉపాధిపనులను ఆయన గురువారం ఆకస్మికంగా పర్యవేక్షించారు. పనుల వద్ద మౌలిక సదుపాయాల కల్పనపై సంతృప్తి వ్యక్తం చేశారు. మస్టరును పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు ఒకరికి బదులు మరొకరు రావడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి పొరపాట్లు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ కేశవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువుల జోలికి వెళ్లొద్దు

- ఆర్డీఓ హేమలత



కోదువాని బందను పరిశీలిస్తున్న ఆర్డీఓ హేమలత

పార్వతీపురంటౌన్: పార్వతీపురం సబ్‌డివిజన్ పరిధిలో చెరువుల జోలికి వెళ్లవద్దని ఆర్డీఓ హేమలత అన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని బెలగాం లక్ష్మునాయుడు చెరువును ఆమె సందర్శించి అందులో ఉన్న అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువుల ఆక్రమణలు ఎక్కువవుతున్నాయని పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఆక్రమణలకు గురైన చెరువులను పరిశీలిస్తున్నామన్నారు. లక్ష్మణనాయుడు చెరువులో అక్రమ కట్టడాలను గుర్తించామని వారికి నోటీసులు అందజేస్తున్నామన్నారు. ఆక్రమణలు చేసిన వారికి వెంటనే నోటీసులు జారీచేసి తదుపరి చర్యలు చేపడతామన్నారు. ఎక్కడైనా ఆక్రమణలకు పాల్పడితే సంబంధిత క్షేత్రస్థాయి సిబ్బందిదే పూర్తి నిర్లక్ష్యంగా పరిగణించి వారిపై క్రమశిక్షణ చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న నిల్వలు, రైతు భరోసా కేంద్రాల తనిఖీ



గురువునాయుడుపేటలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి కె. రాబర్ట్ పాల్

పాచిపెంట: మండలంలోని పాంచాలి, మాతుమూరు, గురివినాయుడుపేట గ్రామాల్లో ఉన్న మొక్కజొన్న పంటల నిల్వలను,రైతు భరోసా కేంద్రాలను జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటాకు మద్దతు ధర రూ.1962లు ప్రకటించిందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తుందని తెలిపారు. దళారులను అమ్మి తక్కువ ధరకు మోసపోవద్దని హితవు పలికారు. అనంతరం గురివినాయుడుపేటలో ఎరువులదుకాణాన్ని తనిఖీ చేసి నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని లేనట్లయితే యజమాని లైసెన్సు రద్దు చేసి క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.సమీపంలో ఉన్న రైతు భరోసా కేంద్రానికి వెళ్లి కియోస్క్ పనితీరు, ఎరువుల నిల్వలు వివిధ రిజిస్టర్లు తనిఖీ చేశారు. తప్పనిసరిగా అన్ని రైతు భరోసా కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి రిపోర్టు ఇవ్వాలని ఏడీఏ మధుసూదనరావు, ఏవో తిరుపతిరావులను ఆదేశించారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రవేశాలు



టెన్త్ పాసైన విద్యార్థుల నుంచి అంగీకారపత్రాన్ని స్వీకరిస్తున్న అధ్యాపకులు.రవికుమార్, రామకృష్ణ



పార్వతీపురం టౌన్: అడ్మిషన్ డ్రైవ్‌లో పాల్గొన్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సీతానగరం: పదోతరగతి పాసైన విద్యార్థులకు రాకపోకల సదుపాయం, మౌలిక వసతులున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రవేశాలు జరుగుతున్నాయని అధ్యాపకులు టి.రవికుమార్, డి.రామకృష్ణ సహచర అధ్యాపకులు మండలంలోని తామరఖండిలో ప్రచారం చేస్తూ టెన్త్ పాసైన విద్యార్థుల నుంచి ప్రవేశ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ జూనియర్ కాలేజీల్లో విద్యా బోధనకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో జరుగుతోందన్నారు. ఎవరైనా గ్రామాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాబోధనను పరిశీలించి వారి పిల్లల్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేర్పించి ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. ఇప్పటికే పలు గ్రామాల్లో ప్రచారం చేసి పేరెంట్స్, విద్యార్థులతో ప్రవేశ దరఖాస్తులను స్వీకరించినట్లు చెప్పారు, కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీధర్, మోహనరావు, నవీన్, అమ్మాజీ, పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలే ముద్దు

పార్వతీపురం టౌన్: ప్రైవేట్ వద్దు..ప్రభుత్వ డిగ్రీ కళాశాలలే ముద్దు అని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలపతిరావు అన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలోను, కొమరాడ మండలంలో అడ్మిషన్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం పట్టణం, చుట్టుపక్కల గ్రామాలలో ఇంటర్‌మీడియట్ పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన విద్యార్థులను వారి తల్లిదండ్రులను కళాశాల అధ్యాపకులు కలిసి కళాశాలలోని సదుపాయాలు, సౌకర్యాలు, బోధన-అభ్యసన కార్యక్రమాలపై వివరించామన్నారు. కళాశాల ఆధునికీకరణ, డిజిటల్ బోధన మొదలైన వాటి గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్నామని చెప్పారు. కళాశాల కరపత్రాలను పంచి పెడుతూ కళాశాలలోని సదుపాయాలు సౌకర్యాలను విద్యార్థులకు తల్లిదండ్రులకు వివరించామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.